క్లుప్తంగా

గ్రామాల్లో భూహక్కు సర్వే



గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే చురుగ్గా చేపడుతున్నారు. మొదటి విడతగా గుంటపల్లి, మాసాహెబుపేట, కేశవరం, సత్యవరం, మంగవరం, కందిపూడి, గోపాలపట్నం, పీఎల్‌పురం, పాయకరావుపేట, పెదరాంభద్రపురం, వెంకటనగరం, పెంటకోట గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపడుతున్నారు. ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నట్లు ఈవోఆర్‌డీ వై.వి. సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



స్టేషన్ రోడ్డు హైస్కూల్లో ధ్యాన్‌చంద్ చిత్ర పటం వద్ద నివాళులు

యలమంచిలి(అనకాపల్లి): యలమంచిలి స్టేషన్ రోడ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. హాకీ మాంత్రికుడు, ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు అందించిన ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పాల సంఘం అధ్యక్షుడిగా సోమునాయుడు



సోమునాయుడిని అభినందిస్తున్న స్థానికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని గొర్లె ధర్మవరం విశాఖ డెయిరీ అనుబంధ పాల సంఘం అధ్యక్షుడిగా గొర్లె సోమునాయుడు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఈ సందర్భంగా సోమునాయుడిని పలువురు అభినందించారు. ఎన్నికల కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్ గొర్లె అశ్వినీ నూకరాజు, గొర్లె రామజోగి, మడక కోటేశ్వరరావు, గొర్లె ఈశ్వరరావు, గొర్లె నరసింగరావు, జెర్రి పోతుల ప్రసాద్, గొర్లె చిరంజీవి, గొర్లె అప్పలరాజు, గొర్లె రమణ, గొర్లె గోవిందరావు, గొర్లె గంగునాయుడు, తాత నాయుడు, గెంజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ధ్రువీకరణ పత్రాలు



తూర్పు కాపులకు బీసీ-డీ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ మహేష్

మునగపాక : జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ప్రజలకు అందాయని మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామన్నారు. మునగపాకలో ఆయన మంగళవారం తూర్పుకాపులకు బీసీ-డీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంఘ మండల అధ్యక్షుడు బలిరెడ్డి సూరప్పారావు, గృహ సారథి కర్రి పద్మ, వార్డు సభ్యురాలు బలిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధి సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

మునగపాక : గ్రామాలాభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వెంకటాపురం సర్పంచ్ తాతాజీ, ఎంపీటీసీ వీరునాయుడు తెలిపారు. గ్రామంలో ఎంపీటీసీ తన కోటా ద్వారా మంజూరైన రూ.2.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు.

దేశభాషలందు తెలుగు లెస్స



నక్కపల్లిలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



చిత్ర లేఖనం పోటీల్లో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసిన పాఠకులు

నక్కపల్లి : దేశ భాషలందు తెలుగు భాష ఎంతో గొప్పదని, కేజీబీవీ ప్రత్యేకాధికారి సలీం అన్నారు. తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పదానాన్ని విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నక్కపల్లి, చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయాల్లోను వివిధ గ్రామాల్లో పాఠశాలల్లో కూడా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.

పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాహితీవేత్త రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం కార్యకర్త మహమ్మద్ అబ్దుల్ అజీజ్, తెలుగు విశ్రాంత ఉపాధ్యాయుడు యాజ్ఞవల్క శర్మ, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల హెచ్‌ఆర్ డెరెక్టర్ బంగార్రాజు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుని అపర్ణ పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల్పరించారు.

మునగపాక: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు పద్యాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

యలమంచిలి(అనకాపల్లి): పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు డి.శోభారాణి విద్యార్థులకు మేజర్ ధ్యాన్‌చంద్ జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం నాటిక ఆకట్టుకుంది.

కోటవురట్ల : మండలంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, కేజీబీవీ ఎస్‌వో సరోజినీదేవి పాల్గొన్నారు.



పాటిపల్లి మోడల్ స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం



భువన విజయం నాటికలో దృశ్యం



పాములవాకలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులు

ఒడ్డిమెట్ట లక్ష్మీ గణపతి ఆలయానికి రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నక్కపల్లి: మండలంలో ఒడ్డిమెట్ట కైలసగిరిపై వెలసిన లక్ష్మీగణపతి ఆలయానికి దాతల సాయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ గొర్ల రాఘవకుమారి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఒడ్డిమెట్టలో స్వయం వ్యక్తమై వెలసిన లక్ష్మీగణపతి ఆలయం ఉంది. ప్రతి ఏటా వినాయక చవితినాడు, యలమంచిలి, తుని, పాయకరావుపేట, నర్సీపట్నం, నక్కపల్లి, అడ్డురోడ్డు, తదితర ప్రాంతాలనుంచి లక్షలాది మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ఇక్కడ బొజ్జ గణపయ్య భక్తులతో పూజలందుకుంటున్నాడు. ఈ ఆలయం కైలసగిరిపై ఉంది. ఇప్పటి వరకు మెట్ల మార్గం గుండా వెళ్లి భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో దాతల సహకారంతో పాతరోడ్డు నుంచి కొండపై గర్భాలయం వరకు రోడ్డు నిర్మించడానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి కూడా కొంత నిధులు సేకరించి రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించారు. కొండపైకి రోడ్డు నిర్మాణం వల్ల మెట్ల మార్గంతో పాటు వాహనాలు కూడా ఆలయం సమీపం వరకు వెళ్లే అవకాశం కలిగింది.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవం



కె.వెంకటాపురంలో హాకీ స్టిక్ ఆకృతిలో విద్యార్థులు



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల: మండలంలో నేషనల్ స్పోర్ట్స్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో వేడుక జరిపి విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. పాములవాక, కె.వెంకటాపురం గ్రామాలలోని జెడ్పీ హైస్కూళ్లలోను, కేజీబీవీలోను నేషనల్ స్పోర్ట్స్ డే నిర్వహించి విద్యార్థులు విన్యాసాలు చేశారు. వివిధ ఆకృతుల్లో విద్యార్థులు చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కేజీబీవీ, పాములవాకలో విద్యార్థులు నేషనల్ స్పోర్ట్స్ డే అక్షరాలతో ఆకృతిగా మారి విన్యాసం చేశారు. కె.వెంకటాపురంలో జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు హాకీ స్టిక్ ఆకృతిగా ఏర్పడి కనువిందు చేశారు. కేజీబీవీలో విద్యార్థినుల పిరమిడ్స్ ఆకట్టుకున్నాయి. పాముకవాకలో హెచ్‌ఎం కె.ఎల్.నారాయణ, పీడీ అచ్యుత్, కేజీబీవీలో ఎస్‌వో సరోజినీదేవి పాల్గొన్నారు.

బీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో...

నక్కపల్లి : మనసుకు ధ్యానం ఎంత ముఖ్యమో ఆరోగ్యానికి క్రీడలు అంతే అవసరమని రాష్ట్రపట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. మంగళవారం క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని నక్కపల్లిలో ఘనంగా నిర్వహించారు. బీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడల పట్ల ఉత్సాహం చూపే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇక్కడ ఏర్పాటైన హాకీ క్లబ్ ద్వారా చాలా మంది విద్యార్థులు హాకీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు పొందారన్నారు. హాకీ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులను దేశానికి పరిచయం చేస్తున్న బీఎస్ హాకీ క్లబ్ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గణపర్తిలో ఎంపీ నిధులతో సీసీ రోడ్లు



గణపర్తిలో ఎంపీ డాక్టర్ సత్యవతి నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు

మునగపాక : గణపర్తి గ్రామంలో రహదారుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి దత్తత గ్రామమైన గణపర్తిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమయ్యే చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ చదరం నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి చొరవతో గణపర్తి గ్రామంలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. గ్రామంలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో భాగంగా పలువురు సర్పంచ్‌లు గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయని తగు నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీల ఖాతాల్లో జమ అయిన నగదును ప్రభుత్వం తీసుకోవడం వల్ల పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ జోక్యం చేసుకొని త్వరలో జరగనున్న స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో సర్పంచ్‌ల సమస్యలపై ప్రస్తావించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఖరీఫ్‌కు ఇప్పటికే విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల ద్వారా అందజేశామన్నారు. సొంత స్థలంలో ఇంటి నిర్మాణాలు చేసేవారికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ చిందాడ దేవితో పాటు పలువురు ఎంపీటీసీలు అధికారులను కోరారు.

నేటినుంచి జగనన్న పాలవెల్లువ రుణ మేళా

నక్కపల్లి: మండలంలో బుధవారం నుంచి జగనన్న పాల వెల్లువ రుణమేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ కృపావతి తెలిపారు. పాడి పరిశ్రమను, పాడిరైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా బ్యాంకుల ద్వారా పాడిరైతులకు సబ్సిడీతో కూడిన రుణాలను అందించడం జరుగుతుందన్నారు. బుధవారం జగనన్న పాల వెల్లువ కోసం ఎంపికచేసిన ఉపమాక, చుక్కల వాని లక్ష్మీపురం, మనబాన వానిపాలెం , సారిపల్లిపాలెం, కాగిత, నక్కపల్లి , వెదుళ్లపాలెం గ్రామాల్లో పాడి రైతులతో అవగాహన సదస్సులు, రుణమేళాలు నిర్వహిస్తున్నామన్నారు.

66 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ఖాజీపాలెంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరంలో మంగళవారం 66 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 17 మందిని అగనంపూడి హోమిబాబా క్యాన్సర్ ఆస్పత్రికి తరలించారు. ఏడుగురిని ధూమపానం మానేయాలని వైద్యులు సూచించారు. క్యాన్సర్ రోగులకు అగనంపూడి క్యాన్సర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సీపీఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం(అనకాపల్లి): దేశవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించే సమరభేరి కార్యక్రమ పోస్టర్‌ను అచ్యుతాపురంలో మంగళవారం ఆవిష్కరించారు. సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంతకాల సేకరణ, సచివాలయాల్లో వినతి పత్రాల సమర్పణ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా తదితర కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో కర్రి అప్పారావు, రామునాయుడు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

ఎస్.రాయవరం : మండలంలో గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామంలో చెవిటి నూకాలమ్మతల్లి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ అమ్మవారి జాతరను గ్రామస్తులు కనుల పండువలా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వచ్చింది. భక్తులు వేకువ అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు, చీర సారెలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పరదేశమ్మ పండగ

రాంబిల్లి: దిమిలి గ్రామంలో మంగళవారం పరదేశమ్మ అమ్మవారి ఆలయాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని పూలతో ఎంతో ఆకర్షణీయంగా అలంకరించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ రాజు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు

కోటవురట్ల : మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, ఆయన కుమారుడు డీబీవీ రాజగోపాలరాజు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు సూర్యనారాయణరాజు తెలిపారు. సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి కూడా ఉన్నట్టు తెలిపారు.

విద్య, వైద్యానికి జగనన్న ప్రభుత్వం ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపనకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : విద్యలో పెనుమార్పులు వచ్చేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంస్కరణలు చేస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రేవుపోలవరం గ్రామంలో రూ.2.97 కోట్లతో ఉన్నత పాఠశాల భవనం నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. సువిశాలమైన ప్రదేశంలో పాఠశాల భవనం నిర్మాణానికి చేపట్టేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలకు రూపురేఖలు మారుస్తూ కార్పొరేట్ స్థాయిని మించి సదుపాయాలు కల్పిస్తూ, అవసరమైన అదనపు భవనాలు నిర్మాణానికి కోట్లాది రూపాయలు కేటాయించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు.

వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం..

ప్రతి ఒక్కరికి అందుబాటులో వైద్యం దొరకాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొత్త రేవుపోలవరం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మాణం చేసి వెల్‌నెస్ కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకరదేవి, వైస్ ఎంపీపీ అప్పన్న, ఎంఈవో మూర్తి, పంచాయితీరాజ్ డీఈ రాజ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యులు రాజేశ్వరి, సర్పంచ్‌లు లోవరాజు, చోడిపల్లి అనూరాధా గోవిందులు, కోశెట్టి వెంకటరమణ, దూళి శ్రీనుబాబు పాల్గొన్నారు.

గ్రామాలభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



ఎస్.రాయవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఎస్.రాయవరం గ్రామంలో రెండవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలు కాలనీల్లో పర్యటించి పలువురిని పలకరించారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ విద్య, వైద్య సేవల్లో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తాగునీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు రూ.200 కోట్లు నిధులు కేటాయించారన్నారు. తద్వారా గ్రామంలో పైపులైను ఏర్పాట్లు చేసి, ట్యాంకులు నిర్మాణం చేసి తాగునీటిని అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి డ్రైనేజీలు , శిథిలమైన చోట రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం పరిధిలోని ఆటో డ్రైవర్లు కచ్చితంగా అన్ని రికార్డులు కలిగి ఉండాలని పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ అన్నారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఆటో యూనియన్ సభ్యులతో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, జంక్షన్‌కు కనీసం 50 మీటర్ల దూరంలో ఆటో పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.